క్లుప్తంగా

శివస్వాముల శ్రీశైలం పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములు

కుల్కచర్ల: శివమాలధారణ చేసిన స్వాములు పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయం నుంచి మల్లికార్జున సేవా సమితి ఆధ్వర్యంలో పాదయాత్రగా శ్రీశైలం దేవస్థానానికి వెళ్లారు. వంశీకార్తీక్ గురుస్వామి, చెన్నయ్య గురుస్వాముల ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగుతోంది.

గాయపడిన వానరానికి సపర్యలు



కోతికి నీటిని తాగిస్తున్న పాదచారులు

పరిగి: రోడ్డు ప్రమాదంలో గాయాలైన వానరానికి సపర్యలు చేసి మానవత్వం చాటుకున్నారు. పట్టణ కేంద్రంలో బహార్‌పేట్‌లో గుర్తు తెలియని వాహనం కోతిని ఢీకొంది. దీంతో దానికి గాయాలవ్వడంతో అటుగా వెళ్తున్న పాదచారులు కట్లు కట్టి నీటిని తాగించి, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. కాసేపటికి అధికారులు వచ్చి వానరాన్ని తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగడపల్లి గ్రామంలో నిర్మిస్తున్న నూతన హనుమాన్ దేవాలయ నిర్మాణానికి సోమవారం మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి కలిసి 1లక్ష రూపాయలు, గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు విష్ణుశ్‌గౌడ్ 50 వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజు, సత్తయ్యగౌడ్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ అభివృద్ధికి విరాళం అందజేస్తున్న దాత మహిపాల్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని హాజిపల్లి రోడ్డు విజయనగర్ కాలనీలోగల వీరాంజనేయ సహస్ర లింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి సోమవారం పట్టణానికి చెందిన గౌని శేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గౌని మహిపాల్‌రెడ్డి రూ.1.50లక్షల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం మహిపాల్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సభ్యులు బాలగోపాల్, శంకర్‌రెడ్డి, ఎలికట్ల శేరివెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో వెలిసిన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, అంజయ్యయాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు మహోత్సవానికి వచ్చిన అతిథులకు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, అగ్గనూరి విశ్వం, రాఘవేందర్‌గౌడ్, రాయికల్ శ్రీనివాస్, రాజుగౌడ్, బసప్ప, రవిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, లక్ష్మణ్ నాయక్, చందునాయక్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు ప్రభుత్వం అండ

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



యాలాల: చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో తాండూరు పట్టణానికి చెందిన 110 మందికి రూ.1.10 కోట్ల విలువ గల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తోందన్నారు. ఇప్పటికే గ్యాస్ సిలిండర్, కరెంటు బిల్లు, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మహిళలకు, ఆడబిడ్డలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాండూరు పట్టణానికి చెందిన మక్బూల్ అహ్మద్‌కు రూ.5లక్షలు, పెద్దేముల్‌కు చెందిన వెంకటయ్యకు రూ.75 వేల ఎల్‌ఓసీని సీఎంఆర్‌ఎఫ్ కింద ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సోమవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.

ప్రణాళిక ప్రకారం పథకాల అమలు

యాలాల: ప్రణాళిక ప్రకారం పథకాల అమలుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల హామీలు ఒక్కొక్కటిగా పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. మండల పరిధిలోని 85 మంది లబ్ధిదారులకు రూ.85.09 లక్షల చెక్కులను అందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు భీమప్ప, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం టీయూటీఎఫ్(తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) యాలాల మండల శాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

కంటి వైద్య శిబిరం ప్రారంభం

తాండూరు రూరల్: అభివృద్ధిలో వైద్యానికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కరన్‌కోట్ గ్రామంలో ఎల్‌ఎన్‌ఆర్ యువసేన, శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇందులో 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 60 మందిని ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగప్ప, ఎల్‌ఎన్‌ఆర్ వ్యవస్థాపకుడు లొంక నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

తాండూరు మండల పరిధిలోని బెల్కటూర్ గ్రామ సమీపంలోని వాగుపై నిర్మిస్తున్న హై లెవల్ బ్రిడ్జి పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం తాండూరు-కరన్‌కోట్ రోడ్డు మార్గంలోని బెల్కటూర్ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అర్థవంతమైన బోధన అందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్

దోమ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయులు అర్థవంతమైన బోధనను అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ వెంకట్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని ఆయా పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల సమయం కంటే ముందే పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు అడిషనల్ తరగతులను తీసుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపి మెరుగైన ఫలితాలను రాబట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కిష్టాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లాల్యా నాయక్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ని దెబ్బతీయొద్దు



ఎంపీడీఓకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి కూలీలు

మోమిన్‌పేట: పురపాలక సంఘంగా మోమిన్‌పేట ఏర్పడితే ఉపాధి హామీ పథకం కింద పని కోల్పోతామని ఆ గ్రామస్తులు సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల మోమిన్‌పేటతో పాటు 8 గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ మున్సిపాలిటీ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. అందుకు అధికారులు సైతం పూర్తి వివరాలు సమర్పించారు. దీంతో మున్సిపాలిటీ ఏర్పడితే ఉపాధి హామీ పథకం రద్దు అవుతుందని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా గ్రామీణ నేపథ్యం ఉండటంతో ఉపాధి పథకంపైనే ఎక్కువగా ఆధారపడ్డామని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యపై దృష్టి సారించాలని కోరారు.

వెంటనే రుణమాఫీ చేయాలి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన నాయకులు, రైతులు



షాబాద్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

షాబాద్: రుణాలు మాఫీ కానీ రైతులకు వెంటనే మాఫీ చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జడల రాజేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన రుణమాఫీ కాని రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సీఎం డౌన్.. డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వం రైతుల రుణాలు మాఫీ చేయాలని, రైతుభరోసా అందించాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షాబాద్‌లో కేటీఆర్ రైతు ధర్నా జరిగిన ప్రదేశాన్ని కాంగ్రెస్ నాయకులు నీళ్లు, కల్లాపి చల్లి శుద్ధి చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. అంబేడ్కర్ అందరివాడని, ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసనలు తెలపడానికి అందరికీ స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. కుమ్మరిగూడ గ్రామానికి చెందిన జనమ్మకు రుణమాఫీ కాలేదని, ఆమె రైతు ధర్నాలో కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చిందని, దీనిపై కాంగ్రెస్ నాయకులు ఏదేదో మాట్లాడటం సరికాదన్నారు. వాళ్ల కొడుకుల పేరుపై భూమి చేశారని, వాళ్లకు బ్యాంకుల్లో రుణమాఫీ అయ్యిందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని చెప్పారు. జనమ్మ కొడుకులకు అసలు బ్యాంకులో ఖాతా కూడా లేదనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గ్రహించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలు ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ రైతుధర్నా ప్రదేశాన్ని శుద్ధి చేయడం కాదని, వాళ్ల మనస్సులను ఫినాయిల్‌తో కడుక్కోవాలని సూచించారు. అలాంటి చిల్లర చేష్టలు మానుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పోనమోని కేత న, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాంచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, నర్సింహులు, చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మండలి సత్యం, నాయకులు రమేష్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, భూపాల్‌రెడ్డి, మల్లేశ్, వెంకట్‌రెడ్డి, ముఖ్రంఖాన్, రాంచందర్, రాజేశ్వర్‌రెడ్డి, యాదిరెడ్డి, పురుషోత్తంచారీ, అవిలాశ్‌గౌడ్, యాదయ్య, మహిళా రైతులు చెన్నమ్మ, స్వరూప, పార్టీ శ్రేణులు, తదితరులున్నారు.

ఘనంగా స్వయం పరిపాలనోత్సవం



మందిపల్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కుల్కచర్ల: మండల పరిధిలోని మందిపల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ సహచర విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. కలెక్టర్‌గా అనూష, డీఈఓగా కవిత, ఎంఈఓగా శివలీల, ప్రధానోపాధ్యాయులుగా పూజ, మరికొందరు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో చౌడాపూర్ మండల ఎంఈఓ రాంచందర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు యాదయ్య, ఉపాధ్యాయులు విజయ శ్రావణ్, రాందాస్, అనిల్, శ్రీను, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు అభినందన

దుద్యాల్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జన్మదినాన్ని మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలో కేకు కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, జావిద్, వెంకటయ్య, రమేశ్, నర్సింలు పాల్గొన్నారు

మహిళలు ఆర్థికంగా రాణించాలి

కొందుర్గు: మహిళలు ఆర్థికంగా రాణించాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్ అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పద్మారం గ్రామంలో పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా మంజూరైన పిండి గిర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30శాతం సబ్సిడీతో రూ.2లక్షలు మంజూరయ్యాయన్నారు. రూ.60వేల రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఎం నర్సింహులు, మాజీ సర్పంచ్ లక్ష్మిసుధ, మాజీ ఎంపీటీసీలు మానయ్య, రాములు, మహిళా సమాఖ్య అధ్యక్షుడు మంజుల, కార్యదర్శి లక్ష్మి, సీసీలు దేవయ్య, రమేశ్, వీఓఏ యాదయ్య పాల్గొన్నారు.

దేవాలయాలను అభివృద్ధి చేసుకుందాం

కేతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శోభ

మొయినాబాద్‌రూరల్: దేవాలయాలను అభివృద్ధి చేసుకునేందుకు అందరూ కృషి చేయాలని కేతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ శోభ, మాజీ ఎంపీటీసీ అర్చన పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ ఆలయ నిర్మాణానికి కేతిరెడ్డిపల్లి, అనుబంధ గ్రామమైన చాకలిగూడ గౌడ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు రేనెట్ల సంగమయ్య రూ.1.01లక్షలను విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడ్ల వెంకటయ్య, నాయకులు గోడుగు యాదయ్య, మోత్కుపల్లి కృష్ణారెడ్డి, కారోబార్ కృష్ణారెడ్డి, రేనెట్ల సంగమయ్యగౌడ్, పెంటయ్యగౌడ్, దర్శన్‌గౌడ్, శివలింగంగౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

సాగు భూముల పరిశీలన



అజీజ్‌నగర్‌లో గ్రామ రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రకళ, అధికారులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. సోమవారం రైతు భరోసా పరిశీలన చివరిరోజు కావడంతో అజీజ్‌నగర్ గ్రామాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్ రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏఈఓ సురేష్‌బాబు, మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్, వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అహ్మద్, ఆర్‌ఐ సుజిత్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు సునిల్, కుమార్, రెవెన్యూ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

ఆర్డీఓ చంద్రకళ



ఆర్డీఓ చంద్రకళకు ఫిర్యాదు అందిస్తున్న ధర్మసాగర్ గ్రామస్తులు

చేవెళ్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నామని, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్డీఓ చంద్రకళ తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజావాణిలో మొత్తం ఆరు ఫిర్యాదులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇందులో షాబాద్ మండలానికి సంబంధించి మూడు రెవెన్యూ ఫిర్యాదులు, మొయినాబాద్ నుంచి రెవెన్యూకు సంబంధించి ఒక్కటి రైతు బంధు ఇవ్వాలని ఫిర్యాదు వచ్చిందన్నారు. చేవెళ్ల మండలానికి సంబంధించి ధర్మసాగర్ గ్రామస్తులు ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్లు కేటాయించాలని కోరుతూ గ్రామ నాయకులు, గ్రామస్తులతో వచ్చి ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులన్నింటినీ సంబంధిత అధికారులకు పంపించి వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, రెవెన్యూ అధికారులు, తదితరులు ఉన్నారు.

ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో ఉన్న వీరశైవ ఆగమ వేద పాఠశాలలో విద్యార్థులకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దగ్గు, జ్వరం, జలుబు వంటివి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టిక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. సీజనల్‌గా వస్తున్న వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా 105 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ ముస్తాక్ అహ్మద్, హెల్త్ సూపర్‌వైజర్ రమ, అశోక్, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి సరికాదు

బొంరాస్‌పేట: గురువులతో ప్రతిఒక్కరూ గౌరవంగా మెలగాలని మండల ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఇటీవల తుక్కుగూడలో హెచ్‌ఎం రాములుపై జరిగిన సంఘటనకు నిరసనగా సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్‌ఎం రాములుపై అరచక శక్తులు దాడి చేసి, విద్యార్థి కాళ్లు మొక్కించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, గోపాల్, క్లస్టర్ హెచ్‌ఎం రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శ్రీప్రియ, లక్ష్మి, ఉమాదేవి, నరేందర్‌గౌడ్, పర్వీన్, సల్మాబేగం, మెహరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నేటి నుంచి గ్రామ సభలు



దోమ: సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

కొడంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా వివిధ సంక్షేమ పథకాల సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. గ్రామసభల ద్వారా ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తుంది. మండల పరిధిలో మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉషశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల ఆవరణలో అధికారులు సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తారని వివరించారు.

సమీక్ష సమావేశం

దోమ: అధికారులు గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి హన్మంతు రావు తెలిపారు. సోమవారం దోమ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మహేశ్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, ఎంపీఓ సోమలింగం, ఏఓ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో..

ధారూరు: మండలంలోని 32 గ్రామ పంచాయతీలలో మంగళవారం ప్రజా పాలన గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదట అల్లాపూర్, అల్లిపూర్, అంపల్లి, అవుసుపల్లి, చింతకుంట, ధర్మాపూర్, దోర్నాల్, గడ్డమీది గంగారం, గట్టెపల్లి, హరిదాస్‌పల్లి, కుమ్మర్‌పల్లి, మైలారం, మోమిన్‌కలాన్ తదితర గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: ప్రజాపాలన గ్రామ సభలు మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తామని ఎంపీడీఓ రాములు తెలిపారు. 21న యాచారం, నూరుల్లాపూర్, 22న మాలసోమారం, బస్వాపూర్, నాగవరం, 23న బంట్వారం, సల్బత్తాపూర్, తొర్మామిడి, 24న బొప్పునారం, రొంపల్లి, మంగ్రాస్‌పల్లి గ్రామాల్లో ప్రజాపాలన సభలు ఉంటాయన్నారు.

తాండూరులో..

తాండూరు రూరల్: మండలంలోని 11 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లాపూర్, బిజ్వార్, చెంగోల్, గోనూర్, ఎల్మకన్నె, వీర్‌శెట్టిపల్లి, చిట్టిఘనాపూర్, గుంతబాసుపల్లి, మల్కాపూర్, కోత్లాపూర్ గ్రామాల్లో మంగళవారం సభలు నిర్వహిస్తున్నామన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా జరుతుందని, ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులందరూ సభకు హాజరై లబ్ధిదారుల ఎంపికలో భాగస్వాములు కావాలన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండలంలోని 33 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం నుంచి ఈనెల 24 వరకు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా సంక్షేమ పథకాలపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీలలో మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి సదానందం పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సభలను విజయవంతం చేయాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622